# జడ్జిగారి డైరీలోంచి

కన్నడమూలం: ఎచ్. ఎస్. పార్వతి

అనువాదం: శర్వాణి



జడ్జి :—

నా ఇన్నేళ్ళ అనుభవంలోనూ ఎప్పుడూ ఇలాటి చిత్రమైన కేసు తటస్థపడినట్టు గుర్తులేదు. క్రిమినల్ కోర్టుకు వచ్చి నప్పటినుండి ఎన్నో ఖూనీ కేసులువచ్చాయి. విచిత్రమైనవి, భయంకరమైనవి, ఊహించ టానికి కూడా వీల్లేనివి అవి. ఆ నేరస్థులూ అంతే. చిత్రవిచిత్రమైన స్వభావాలు కల వారు. కేవలం డబ్బుకోసం ఎదుటివారి గొంతుకోసే వారిదగ్గరినుండి, ఖూనీ చెయ్యా లన్న ఉద్దేశ్యంతోనే కొన్నేళ్ళు అన్ని సమ కూర్చుకొని ఆఖరికి తమ కోర్కె నెరవేర్చు కున్నవారిదాకా భిన్నమైన తరహాలవారున్నారు. ఒక పాపాన్ని దాచటానికోసం మరో పాపం చేసే వ్యభిచారిణిలు ఇష్టంలేని భర్తతో కాపురం చెయ్యలేక, విడిచివెళ్ళేదారిలేక నిద్ర పోతున్న భర్త నెత్తిన బండరాయి పడేసి చంపిన వనితలూ, తమకు లేని భాగ్యాన్ని మరొకరు అనుభవించటాన్ని చూసి సహించ లేక అసూయతో మందో మాకో పెట్టే వారు— ఇలా నానా రీతుల్లో చేసిన తప్పు లను దాచలేక న్యాయదేవత ముందు నుంచుని బలి పశువులై పోయారు వీరంతా.

మనిషి కోపానికి వశమైనప్పుడు ద్వేషానికి మనస్సులో తావిచ్చినప్పుడు పశువుకన్న హీనమైపోతాడన్నదానికి సాక్షులు వీరంతా. పైపైన ఎంతటి నిరపరాధులమన్న ముసుగు కప్పుకున్నా, వాళ్ళ మొహాలమీద ముద్ర వేసినట్టు కనిపిస్తున్న క్రూరత్వపు ఛాయలు వీరు నేరస్థులని పట్టిస్తూండేవి. కొంచం కూడా ఆనవాళ్ళు లేకుండా నేరాలు చేసేవారు కొందరు. వీళ్ళల్లో 'ఎంతమంది న్యాయదేవత ముష్టినుండి తప్పించుకొని నాగరిక సమాజంలో సభ్యులుగా చలామణి అవుతున్నారో మరి! లేక, ఎవరికెరుక? మనసులో ద్వేషమూ క్రోధమూ నాట్యం చేస్తున్నప్పుడు, అవి వివేకాన్ని మరచి నృత్యం చేసేటప్పుడు, పిరికితనాన్ని వెనక్కి నెట్టి వేసి ధైర్యాన్ని పుంజుకున్నప్పుడు తాను ద్వేషిస్తున్న మనిషి ఎదుటపడితే ప్రతి వాడూ అతన్ని స్వాహా చెయ్యటానికి సిద్ధపడవచ్చు తపలాగే, ఇంకొకడూ బ్రతకాలన్న ఉదారతకన్న చట్టానికి భయపడే మనలో చాలామంది 'మంచి' వారుగా ఉంటున్నారేమో!

కాని ఈ సారి నేరస్థుని స్థానంలో

నుంచుంది ఓ స్త్రీ... అందమైన సుశిక్షితురాలైన యువతి విరిసిన కమల పుష్పంలోనైనా కళంకపు ఛాయలను గుర్తించవచ్చునేమోగానీ, ఆమె మొహంలో అనుమానాస్పదమైన భావం కించిత్తూ కానరావటం లేదు. చూడగానే ఓ విధమైన గౌరవ భావాన్ని కల్గించే ఆ తరుణి ఇంతటి దారుణ కృత్యాన్ని చేసి ఉండవచ్చునన్న ఊహను మనస్సులోకి రానివ్వటానికి కూడా నేనంగీకరించలేక పోయాను. ఆమెను బోనులో నిలబెట్టిన పోలీసుల మీదే కోపం రాసాగింది.

ఆ కేసు వివరాలివి. ఖూని చెయ్యబడిన వ్యక్తి ఆ వూళ్ళోని ఓ సంగీతకారుడు. పేరు భాస్కరయ్య. సంగీత పాఠాలు చెప్పుకుని బ్రతికే సామాన్య అంతస్తుకు చెందిన వ్యక్తి. కళాకారుడనటానికన్నా సంగీతం మేష్టారుగానే పిలబడుతూ రోజులు గడుపుతున్న వ్యక్తి. చూట్టానికి పెద్ద వ్యక్తిత్వం ఉన్నవాడుగా కనిపించడు. కొన్ని రోజుల క్రిందట అతను ఆస్పత్రిలో చనిపోయాడు. విష సేవనవల్ల మరణించాడని డాక్టర్లు అభిప్రాయపడ్డారు. చనిపోయే ముందు అతను చెప్పిన ఒక్కమాట వల్ల ఆమె ఇప్పుడు నేరస్థుల స్థానంలో నిలబడాల్సి వచ్చింది. ఆమె ఆ వూళ్లో ఆగర్భ శ్రీమంతులైన కె ఎస్ బాలకృష్ణ గారి ధర్మపత్ని. ఆమె పేరు కుముదా... ఆమెకు సంగీతం నేర్పే వాడే మాష్టారు. రోజూ వాళ్ళింటికి వెళ్ళి వస్తూండేవాడు. ఆ రోజు కూడా వెళ్ళి కాఫీ ఫలహారం సేవించి వచ్చాడు. ఇంటికి వచ్చిన కాస్సేపట్లో పెద్దగా కడుపు నొప్పి వచ్చింది. ఇంట్లోవాళ్ళు భయపడి ఆస్పత్రికి తీసికెళ్ళారు. క్షణ క్షణానికి నొప్పి ఎక్కువవ్వసాగింది. ఏ మందూ, ఇంజక్షనూ అతని నొప్పిని తగ్గించలేక పోయింది. డాక్టర్ని చూసి రోగి అరిచాడు.

'దీనివల్ల లాభంలేదు డాక్టర్ ఆ పిశాచి నాకు విషం పెట్టింది. ఆ విషం పొయ్యే మందివ్వండి. ఆ పాపి నన్ను చంపేసింది...'

'ఎవరు? ఎవరు?'

'ఆదే కుముదా... కుముదా...'

సంగీతకారుడు చనిపోయాడు పోస్టుమార్టం చేసి చూసినప్పుడు అతని మాటలోని నిజం బయటపడింది. చనిపోయే సమయంలో ఎవరూ అబద్ధాలు చెప్పరన్న విశ్వాసం వల్ల అతని మాటకు ఎక్కడలేని విలువా వచ్చిపడింది. కుముద అపరాధిని అనిపించుకుంది. పెద్దింటి కోడలు జైలులో ఉండటమా? వెంటనే భర్త జామీనిచ్చి ఆమెను విడిపించాడు. నీళ్ళలా డబ్బు ఖర్చు పెట్టటానికి తయారయ్యాడు. లెక్కలేనంత మంది సాక్షులను పిలిపించాడు.

ఇంట్లో పనివారంతా సాక్ష్యం చెప్పారు. ఎవరెంత చెప్పినా న్యాయపు త్రాసు పోలీసువాళ్ళవేపే మొగ్గుతోంది ఇక ఆమె! ఈ గొడవవల్ల ఆమె మొహం కాస్త వాడినట్టున్నా, భావరహితమైన శిలా మూర్తిలా నిశ్చలంగా అగుపిస్తోంది ఏ ప్రశ్న అడిగినా 'ఊఁ ఊహూ' అనటం తప్పితే మరోమాట రావటం లేదు ఏ నిర్ణయానికి రాలేక నా మనస్సు అస్తవ్యస్తమైంది.

ఆఖరి రోజున ఆమెనుండి ఓ అర్జీ వచ్చింది - రహస్యంగా తన కేసు విచారించాలని. విచారణ జరిగే సమయంలో తన భర్త కూడా అక్కడుండరాదని కోరుకుంది క్రిమినల్ కేసుల్లో ఇలాటి వాటిని అనుమతించటం కష్టసాధ్యమయినా, అందరి ఎదుటా ఆమె ఏమీ చెప్పదన్న నిర్ణయానికి రావటం వల్ల ఆమె కోరికను అనుమతించాను నిర్ణయించిన రోజున మితపరివారం ఎదుట విచారణ ప్రారంభమయింది

లాయరు ప్రశ్న అడగటానికి ముందే ఆమె చెప్పింది

'నేనతన్ని చంపాను. నేను నేరస్థురాలిని' అని.

వెయ్యి పిడుగులు పడిన చప్పుడొకసారి వినిపించినట్లయింది నాకు మరు క్షణం నాకనిపించింది ఇందులో ఏదో రహస్యముందని ఆమె తన భర్తనో మరెవరో ఆత్మీయులనో కాపాడటానికి నాటకమాడుతోంది నాకివన్నీ అనుభవమే కదా.

నేనడిగాను. 'కారణం?'

'కారణం చెప్పితీరాలా?'

'కారణం లేకుండా ఏ పనీ జరగదు. అపరాధం నిశ్చయించాలంటే కారణాలకే ఎక్కువ ప్రాధాన్యత నివ్వాల్సుంటుంది.'

'చెప్పండి'


'ఆమె తన కథ చెప్పసాగింది భావోద్వేగంతో కాక, నిర్వికారంగా వేరే ఎవరిదో కథ చెప్తున్నట్టు శాంతస్వరంతో చెప్పసాగింది. బహుశ—అప్పుడామె నిండా మునిగిన వాడికి చలేమిటన్న మనస్థితిలో వుందనుకుంటా.

కుముదా: —

అవును నేను నేరస్థురాలిని. హంతకురాలిని. విషం పెట్టి అతన్ని చంపాను. ఎందుకంటే.. అప్పుడు నా ఎదుట ఉన్నదొక్కటేదారి లేదా నేను ఆత్మహత్య చేసుకోవాల్సివచ్చేది. అతన్ని చంపటమే మంచిదనిపించింది నాకు. .ఎందుకు?.. మళ్ళీ ఈ 'ఎందుకు?'కు బదులు చెప్పాల్సివస్తే నా జీవితాన్నే మీ ముందు పెట్టాలి తప్పదు.

నేను సాధారణ మధ్యమవర్గపు కుటుంబంలో పుట్టాను మా నాన్న డబ్బు గలవారు కారు. కాని విద్యా ప్రేమి. కనుకనే ఆడ - మగ అన్న భేదం లేకుండా పిల్లలందరికీ వీలయినంతవరకు చదువు చెప్పించారు ఇక నా అందాన్ని గురించి చెప్పక్కరలేదనుకుంటాను ఈ నా రూపసంపదతోనే సామాన్య గృహస్థు కుమార్తె అయివుండి కూడా వూళ్ళోని ఆ గర్భ శ్రీమంతుని చేపట్టే భాగ్యం కలిగింది. ఓ! ఆ రోజు సంగతి తలుచుకుంటే ఒళ్ళు పులకరిస్తుంది. తల్లి తండ్రుల కెంత ఆనందం? నన్ను చూసి అసూయపడ్డ వాళ్ళెంతమంది! నేనూ లోలోపలే పొంగిపోయాను. మా వారు వొట్టి శ్రీమంతులే కాకుండా రూపవంతులవటం కూడా నా సంతోషానికి కారణమయింది.

ఎంతో సంభ్రమంతో అత్తవారింట్లో అడుగుపెట్టాను కాని కొన్నిరోజుల్లోనే నా కళ్ళకు కప్పినపొర తొలగింది. ఆ ఇంట్లో నాకున్నది ఉత్సవమూర్తి స్థానమేనన్నది అతి త్వరలోనే తెలుసుకోగలిగాను. ఇష్టం వున్నా లేకపోయినా బొమ్మలాగా ముస్తాబయి మా వారు తీసికెళ్ళినచోటికల్లా వెళ్ళటం, పరిచయం చేసినవాళ్ళతో కరస్పర్శ చేయటం, పెదవులమీద నవ్వు పులుముకోటం. ఇది పెళ్ళయిన కొత్తలో నాకున్న పని. ఇంటికొచ్చాకా భర్తగారు నన్ను ఆత్మీయంగా మాటాడించలేదు. కొద్ది రోజుల్లో ఈ హడావిడి తగ్గింది. డబ్బుతో మా వారికి బయటే కావల్సిన విలాస సామగ్రి అంతా సమకూరుతుండడంవల్ల, నానుండి ఆయన కొత్తగా కోరుకోవాల్సినదేమీ ఉండేది కాదు. మొత్తంమీద ఇంట్లో నౌకరుకు కొత్త యజమానురాలు దొరికినట్టుంది కాని నాకు జీవిత సహచరుడు లభించలేదు.



వేసవి
కాలములో
చర్మ
బాధలను పొందకుండుటకు




సల్ఫర్
టాయిలెట్ సోపు

మొటిమలు, చెమట కాయలు, స్వల్పమైన యితర చర్మ బాధలను పోగొట్టి సుఖము నిచ్చును

BENGAL CHEMICAL
CALCUTTA - BOMBAY - KANPUR



**ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్**

లైసెన్సు అక్కరలేదు అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రదర్శనాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్తమైనది




ఆటోమేటిక్ 50 షాట్లు ఏర్పాటు గలదు తేలికైనది. ఇందు నుండి వెలువడు నిప్పు రవ్వలు మిమ్మును కాపాడును. ధర 50 షాట్లు నెం 33 రు 13/50. జర్మన్ మోడల్ నెం 99 రు. 15/50 వి.పి.పి. చార్జీలు రు. 2/50. లెదర్ కేస్ రు 7/- అదనపు షాట్లు 100కి రు 5/-

GEM ARTS (WAPM 15)
P. Box 1325, Delhi 6


# జడ్జిగారి డైరీలోంచి

ఒకే ఇంట్లో ఉన్నా ఇద్దరం అపరిచితుల్లాగే గడిపేవాళ్లం. దాంపత్య జీవితం గురించి నేను కన్న కలలన్నీ పగటికలలే అయ్యాయి.

రోజులు నిస్సారంగా అతి బరువుగా గడిచేవి. మా పుట్టింటిలో ఇలాంటి ఐశ్వర్యమూ, ఆడంబరమూ లేకపోయినా మమత, వాత్సల్యాలకు కొదవ వుండేది కాదు ఏ మాత్రం ఆత్మీయత లభించని ఈ ఇల్లు స్మశానంలా అనిపించసాగింది ఊపిరి పీల్చుకోటమే కష్టమనిపించి, ఆ పరిస్థితి భరించలేక ఓ రోజు ఎక్కడికో బయల్దేరుతున్న మా వారిని ఆపాను అయన కోపంతోనూ, ఆశ్చర్యంతోనూ నావేపు చూశారు. నా మనసులో ఎన్నో భావాలు పొంగి వచ్చాయి. వాటిని మాటల్లో చెప్పలేక పోయాను ఆఖరికి,

'మీరు.. వెళ్లకండి' అన్నాను.

'ఏం?'

'నాకేం తోచటంలేదు.'

'బాగానే వుంది. నీకు తోచదని రోజల్లా నీ ముందు కూచోమంటావా? ఏదైనా క్లబ్బులో చేరు. సినిమాకు వెళ్లు. స్నేహితులతో కలసి కబుర్లు చెప్పుకో— అంతేగాని...'

'కాని...'

మరి గొంతుపెగల్లేదు నాకు.

'నీక్కావల్సింది డబ్బేగా తీసుకో ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెట్టుకో. ఏమైనా చేయి నా విషయాల్లో మాత్రం కల్పించుకోక,'

అంటూ చెక్‌బుక్ నావేపు విసిరేసి తిరిగి చూడకుండా వెళ్లిపోయారు అవమానంతో ఉడికిపోయాను. అనాథలా క్రింద పడివున్న చెక్‌బుక్ నన్ను వెక్కిరించినట్టనిపించింది. మొదటిసారిగా ఆయన పట్ల నా మనసులో తిరస్కార భావం జాగృతమయింది. అబ్బా! ఎంత ధిక్కారం? డబ్బు, నగలు, చీరెలతో ఏ స్త్రీనైనా లొంగదీసుకోవచ్చు ననుకుంటున్నారు వీరు? ఆడదానికీ ఓ హృదయం ఉంది ఆ హృదయం మొదట కోరుకునేది ప్రేమను అన్న సంగతి గ్రహించలేని పశుప్రాయులు.. అయ్యో...నా తెలివి తెల్లారినట్టే ఉంది. వాళ్లకి హృదయముంటేగా మరొకరి హృదయాన్ని గ్రహించటానికి...

ఆ రోజు మా వారిపట్ల నా మనస్సులో జనించిన జుగుప్స, తిరస్కారాలు రోజు రోజుకీ ఎక్కువవసాగినయి. అడవి గాచిన వెన్నెలలా నా జీవితాన్ని నాశనం చేసిన ఆయనపట్ల నా మనస్సులో ద్వేషం, కసి రగులుకొన్నాయి. ఆయనమీద కసి తీర్చుకోవటం ఎలాగో తోచలేదు భర్త నొదిలేసి స్వాతంత్ర్యంగా బ్రతకగలిగే చైతన్యం నాకు లేదు. నేను వెళ్లిపోయినా మావారికి దానివల్ల ఏ నష్టమూ లేదు కూడా. ఏం చెయ్యాలో తోచక మనసులో చోటుచేసుకున్న ద్వేషమన్న పాము పిల్లకు పాలుపోసి పెంచసాగాను ఎక్కువ రోజులు అలాగే వదిలేస్తే ఆ విషంతో నేనే మాడిపోతానేమోనన్న భీతి నన్నావరించింది.

లోపల రాజుకుంటున్న నిప్పును భరించలేక నేను అల్లల్లాడుతుంటే, దానికి తను సూటిపోటి మాటలతో ఆజ్యంపోసి మరింత ప్రజ్వలింపజేసేవారు మా అత్తగారు... కొడుకుపట్ల గుడ్డి ప్రేమతో మూసుకుపోయిన ఆమె కళ్లకు, అయనచేసే పనులు కనిపించేవే కావు కనిపించినా అన్నిటికి నేనే కారణమని ఆమె దృఢాభిప్రాయం. నన్ను చూసినప్పుడల్లా మాటలతో హింసించటం అలవాటయిందామెకు

"మొగుణ్ణి చేతిలో పెట్టుకోలేకపోయాకా, ఇక ఎందుకూ ఆడది? అందమెందుకు కాల్చనా? పెళ్లయి ఇన్నాళ్లయినా ఓ పిల్లా పాపా లేకపోయాక మగవాడు ఇంటిపట్టున ఎలా ఉంటాడు?"

ఆమె మాటల్లో నామనస్సును ఒక్కటి మాత్రం ఎక్కువగా ఆకర్షించసాగింది. అది బిడ్డ...నాకో బాబు కలిగితే...నా బాబు.. నావాడైన బాబు నాకుంటే...వాళ్ల తిరస్కారం...అనాదరణ అన్నిటిని మరచి బ్రతకొచ్చు ఓ భగవంతుడా నాకోబిడ్డ నివ్వలేవా?...ఆ ఊహే ఎంతో అందంగా కన్పించింది నాకు.

కాని ఈ దాంపత్యం ఇలాగే కొనసాగితే ఆ ఊహలు ఊహల్లాగే ఉండిపోక తప్పదు. నా మాతృత్వానికి గొడ్డలి పెట్టుపెట్టిన నా భర్తపట్ల మళ్లీ ద్వేషం హృదయంలో భగ్గుమంది. ఆ రోజుల్లో నా మనసులో రెండే ఆలోచనలు. ఒకటి కసి! రెండు

బాబు!

ఆ సమయంలో నా కంటికి సంగీతం మేస్టారు భాస్కరయ్య కనిపించాడు అప్పటికి కొన్ని నెలలుగా సంగీతం నేర్చుకుంటున్నాను నేను. బ్రతుకులోనే నిరాశచెందిన నాకు సంగీతంమీద పెద్ద ఆసక్తి లేదు. కాని కాలక్షేపానికదో వ్యాసకం అంతే ఆమేస్టారికి కూడా నాకు పాఠం చెప్పటంలోకన్నా, నావేపు చూడటంలోనే ఎక్కువ ఆసక్తి ఉన్నట్టు కనిపించింది. నలుగురు పిల్లల తండ్రయినా స్త్రీ వ్యామోహం తగ్గినట్టు లేదు. ఇక ఏ విధంగానూ తన కోర్కె నెరవేర్చుకోలేక కళ్లతోనే తినేసేలా నావేపు చూస్తూ తృప్తిపడేవాడు. మొదట్లో ఆ చూపులు నాకు జుగుప్స కలిగించినా రానురాను అతన్ని గురించి ఆలోచించటం ప్రారంభించాను. నా తీరని రెండు సమస్యలకూ ఇతడినే ఎందుకు సాధనంగా వాడుకోకూడదనిపించింది. మొదట్లో ఆ ఆలోచనే నాకు అసహ్యమనిపించింది. కాని నాలో తుఫానురేపిన కోర్కె, తల్లి కావాలన్న కాంక్ష, వివేకాన్ని జయించింది. అటూ ఇటూ చూడకుండా కళ్లకు పట్టీలు కట్టుకుని పరిగెత్తే గుర్రంలాగా, నేతరవాతి సంగతి ఆలోచించకుండా, తనకోర్కె నెరవేర్చుకోవటంవేపే పరుగుతీసింది నామనస్సు. తెలిసీ తెలిసీ గోతిలోదిగాను. నాకో సంతానం కలిగాక అతనితో ఇంక ఏవిధా సంబంధం పెట్టుకోనని ముందే మాట తీసుకున్నాను. అతను నా షరతులన్నిటికీ ఒప్పుకున్నాడు. అందమైన ఆడది చేతికి అందుతున్నప్పుడు లేనిపోనివి ఆలోచిస్తూ కూచునే అవివేకి కాడతను. పైగా నాతెలివి తక్కువను బాగానే ఉపయోగించుకున్నాడు.

ఊం...ఇంకా ఏం చెప్పను? నే ననుకున్నట్టుగా తల్లినయ్యాను. అందమైన ఆడపిల్లను కన్నాను. నా అదృష్టంకొద్దీ పాపకంతా నాపోలికేవచ్చింది. పాప ఆగమనంతో ఇంటివాతావరణమే మారిపోయింది. ముసలి అత్తగారికి నామీద ఎనలేని ఆదరాభిమానాలు ఏర్పడ్డాయి. మావారు నన్ను బాగా చూడసాగారు. నా జీవితానికిక చీకటే అనుకున్న నాకు వెలుగు కనిపించసాగింది. కాని అది వెలుగుకాదు. ఇంటిని దహించే అగ్ని అన్న సంగతి త్వరలోనే తెలిసింది. అగ్ని నేనే పెట్టాను. అది క్షణ క్షణానికి

## జడ్జిగారి డైరీలోంచి

వ్యాపిస్తూ పోతోంది. నా నిస్సహాయతను భాస్కరయ్య బాగానే ఉపయోగించుకున్నాడు. అప్పటికే నేను సంగీతం నేర్చుకోవటం మానేసాను. అయినా అతను మా ఇంటికి రావటం మానలేదు. అతను వచ్చినప్పుడల్లా అతను అడిగినంత డబ్బు ఇచ్చి, ఇచ్చి చాలా అయింది నాకు. కొన్ని నగలుకూడా ఇవ్వాల్సి వచ్చింది. ఏమైనా అతని ఆశకుమాత్రం అంతులేకుండా పోతూనే ఉంది. రాను, రాను, అతనినీడ — చూస్తేనే భయపడేలా తయారయింది నాపరిస్థితి. మనశ్శాంతి కరువయింది. ఏ నిమిషంలో అగ్ని భాండం బ్రద్దలవుతుందోనన్న శంకతో విలవిల్లాడిపోసాగాను. భయం నీడలా నన్ను వెన్నంటింది. నన్నుగురించి కాక నా పాపను గురించి నే నెక్కువ బెంగపడసాగాను. ఈ మనిషి ఇలా నన్ను కాల్చుకుపీడిస్తే, అతని బకాసురుడిపొట్ట నింపలేక ఎప్పుడో ఓ రోజు నేను ఓడిపోవటం ఖాయం. అప్పుడు రహస్యం బయట పెడతాడతను. తరువాత నేనూ, నా పాపా ... అనాథుల్లా భిక్షమెత్తుకు తినాలి...దాని బారి నుండి తప్పించుకోటానికి మార్గం ఏమిటి? నా ఇన్ని బాధలకు కారణమైన అతడిని ఇహలోకం నుండి పంపించేస్తే! ఇప్పటికే ఒక




నేరం చేసిన నేను దానికన్నా భయంకరమైన నేరాన్ని చేయటానికి తలపెట్టాను. ఓ చీమను చంపటానికన్నా వెనుదీసే నా మృదు హృదయం ఒక మనిషిని చంపటానికే సిద్ధపడింది.

తరవాత జరిగింది మీకు తెలిసినదే. నేనే నేరస్థురాలిని. హంతకురాలిని. హత్యాకారణాన్ని కూడా మీ ముందుంచాను. క్షమాయాచనచేసి బతకాలని లేదు నాకు. ఈ పాపిష్టి బ్రతుకుమీద విసుగేస్తుంది నాకు. ఒక నేరాన్ని కప్పిపుచ్చటానికి మరో నేరం చేస్తూ గడిపే ఈ బ్రతుకు చాలు. నాకు శిక్ష విధించండి ఉరిశిక్ష విధించండి. నన్ను ఈ నరకం నుండి తప్పించండి కాని ...నా పాప...ఏ పాపమూ ఎరుగని నా పసి పాప...ఈ పాపిష్టిదాని కడుపులో పుట్టిన నేరానికి శిక్ష విధించకండి. నా పాపని మంచి వాతావరణంలో పెరగనియ్యండి. తనెలాటి విషమ పరిస్థితిలో జన్మించిందో, తన తల్లి ఎంత హీనకృత్యాలు చేసింది అన్న సంగతి ఆ పసి మనసుకు తెలియనివ్వకండి. ఇదొక్కటే నా ఆఖరి కోర్కె."

జడ్జి:—

ఆమెకు శిక్ష పడింది. ఇది ఆమె మొదటి నేరం కనుక ఐదేళ్ల కఠిన శిక్ష విధింపబడింది. కాని ఆమె జైలు నుండి బ్రతికి బయటపడుతుందన్న నమ్మకం నాకేం లేదు ఈ కేసు జరిగి ఎంతో కాలమయినా అప్పుడప్పుడూ ఆ జ్ఞాపకాలు నన్ను బాధిస్తూనే ఉంటాయి. కుముద సుందరమైన మొహం నా కళ్లముందు మెదులుతూనే ఉంటుంది. ఆమె చెప్పుకున్నట్టుగా ఆమె హంతకురాలు. అపరాధిని. దానికి న్యాయం దృష్టిలో తగిన శిక్ష లభించింది. కాని సుశిక్షితురాలైన, నిర్మల హృదయపు స్త్రీని అలాటి నీచకృత్యానికి ప్రేరేపింపబడిన ఈ పరిస్థితికి పరిహారమేమిటి? పెళ్లాడిన భార్యను ప్రేమతో చూడని బాలకృష్ణ నిరపరాధా? అతృప్తికి దాసురాలై తనను నమ్మిన ఆడదానిఅసహాయతను దురుపయోగం చేసుకున్న భాస్కరయ్య.. ఇలాటి వ్యక్తులతో నిండిన సంఘంలో కేవలం ఓ అపరాధికి శిక్ష విధించినంత మాత్రాన సమస్య పరిష్కారమవుతుందా? ఈ ప్రశ్నలెన్నో మార్చు నా మనసులో తలెత్తి నా బుద్ధిని సవాలు చేసింది. చేస్తూనే ఉంది. ●